క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు



పొన్నూరు: ఉమ్మడి కృష్ణ, గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి ఫిబ్రవరి 27న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ములకుదురు గ్రామ ప్రధాన రహదారిలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, ఎంపీడీఓ జి.చంద్రశేఖరరావు, తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్‌తో కలసి చెక్‌పోస్టును పరిశీలించారు. బాపట్ల, పొన్నూరుకు వెళ్లే పలు వాహనాలను తనిఖీ చేశారు. తహసీల్దార్ ఎన్నికల ప్రక్రియలో తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: మండలంలోని కొండముది గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని సమస్యలను వివరిస్తూ 'నెరవేరని స్వచ్ఛ సంకల్పం' శీర్షికన ఈ నెల 8వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి మండల పరిషత్ అధికారులు స్పందించారు. ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు ఆదేశాల మేరకు పారిశుద్ధ్య కార్మికులు కాలువల్లో పూడిక తీత, చెట్ల తొలగింపు పనులు చేశారు. రంగుమారిన తాగునీటిని పరీక్షించేందుకు ల్యాబ్‌కు పంపించారు. పనులను పంచాయతీ కార్యదర్శి డి.శాంతకుమారి పర్యవేక్షించారు.

సచివాలయ ఉద్యోగ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



పొన్నూరు: పొన్నూరు పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కొత్త సంవత్సరం క్యాలెండర్, డైరీని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగ సంఘం పొన్నూరు అధ్యక్షులు ఇమ్రాన్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్‌లు షేక్.బాజిద్, బి.ఎస్.శ్రీకాంత్, టి.ఆనందరావు, జాయింట్ సెక్రెటరీలు ఈ. అశోక్ కుమార్, సి.హెచ్.వెంకటసుబ్బమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మ వార్షికోత్సవాలు



పెదకాకాని: తక్కెళ్ళపాడు గ్రామంలోని మహాలక్ష్మమ్మ ఆరో వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున బిందె తీర్థంతో అమ్మవారి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి తీర్థాభిషేకం, సారె సమర్పించడం, కుంకుమ పూజ, ప్రత్యేక హోమాలు జరిపించారు. పూజా కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్న సంతర్పణ జరిగింది. అమ్మవారి గ్రామోత్సవం పురస్కరించుకుని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు



చేబ్రోలు: ప్రమాదవశాత్తూ సైకిల్‌పై వెళ్తున్న వృద్ధుడిని బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద మంగళవారం రాత్రి జరిగింది. నారాకోడూరు గ్రామానికి చెందిన పెద్ది మల్లేశ్వరరావు స్థానిక కెనరా బ్యాంక్ సమీపంలో సైకిల్‌పై వెళ్తుండగా గుంటూరు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాళ్లు, నడుముకు బలమైన గాయాలవటంతో మల్లేశ్వరరావును 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానస వేదన

ఆహ్లాదం.. అందనంత దూరం

- అస్తవ్యస్తంగా మానస సరోవరం
- 50 ఎకరాల పార్కు నిరుపయోగం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని సర్కారు



ఎన్టీఆర్ మానస సరోవరం ప్రారంభోత్సవ స్థూపం



తాళాలు వేసి ఉన్న ఎన్టీఆర్ మానస సరోవరం గేటు



గడ్డి, పిచ్చిమొక్కలతో నిండిన వాటర్ ఫౌంటెయిన్



శిథిలావస్థకు చేరిన కాటేజీలు

పెదకాకాని: చెంగుచెంగున గంతులేసే జింకలు మాయమయ్యాయి. మాట్లాడే చిలకల పలుకులు మూగబోయాయి. సుందరమైన కాటేజీలు గుబురు చెట్ల మధ్య వెలవెలబోతున్నాయి. బోటు షికారు, గుర్రపు స్వారీ కనుమరుగయ్యాయి. రంగురంగు విద్యుత్ కాంతుల్లో నీటిని విరజిమ్మిన వాటర్ ఫౌంటెయిన్‌లు తుప్పుపట్టాయి. ఇదీ గుంటూరు నగర శివారులో ఒకప్పుడు పర్యాటకులతో కళకళలాడిన ఎన్టీఆర్ మానస సరోవరం దుస్థితి. పార్కు మొత్తం అస్తవ్యస్తంగా తయారైంది. రూ.కోట్లాది రూపాయల విలువైన భూమి కారడవిని తలపిస్తోంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా అవుతోంది. పాలకులు, అధికారుల చిన్నచూపే దీనికి కారణం. ఈ పార్కును మళ్లీ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దగలిగితే గుంటూరు జిల్లాలోనే ప్రత్యేక ఆహ్లాదకరమైన ప్రదేశాలలో ఒకటిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

గబ్బిలాలు, కోతులకు నిలయం

గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామ శివారులో 1999 ఏప్రిల్ 25న డాక్టర్ నందమూరి తారక రామారావు మానస సరోవరం పేరుతో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి పక్కనే ఆధునిక హంగులతో నిర్మించడంతో ఇది పర్యాటకులను విశేషంగా ఆకర్షించింది. దీనిలో 5 ఎకరాల భూమిని వాటర్ వరల్డ్ నిర్వాహకులకు లీజుకు ఇవ్వడంతో పార్కు దినదినాభివృద్ధి చెందింది. 2014–2019 మధ్య టీడీపీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల పార్కు అస్తవ్యస్తమైంది. గబ్బిలాలకు, కోతులకు నిలయమైంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పార్కులో ఏర్పాటు చేసిన నిర్మాణాలు శిథిలావస్థకు చేరాయి. బోటు షికారు కోసం తవ్విన చెరువు గడ్డి, గుర్రపుడెక్కతో పూడిపోయింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మానస సరోవరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు. చిన్నపిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులతోపాటు యువకులు, పెద్దల వ్యాయామానికి పరికరాలు ఏర్పాటు చేయాలని, ఉదయం, సాయంత్రాలు వాకింగ్ కోసం ట్రాక్ నిర్మించాలని కోరుతున్నారు.

స్టెమితో గుండెకు భరోసా

- గుండెనొప్పి అనిపిస్తే తొలి గంట ఎంతో కీలకం
- రోగికి ఉచితంగా రూ.45 వేలు విలువైన ఇంజక్షన్
- సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఫిరోజ్ ఖాన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఫిరోజ్ ఖాన్

పొన్నూరు: గుండె నొప్పి వచ్చిన వారికి తొలి గంట ఎంతో కీలకమని, గుండె నొప్పి అనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ వైద్యశాలకు రావాలని నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఫిరోజ్ ఖాన్ చెప్పారు. మంగళవారం స్టెమి యాప్ ద్వారా గుండెకు అందించే అత్యవసర చికిత్సపై మంగళవారం ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ ఎడమ వైపు భుజం లాగడం, ఆకస్మికంగా ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావాలని సూచించారు. పరీక్షల అనంతరం గుండె నొప్పిగా నిర్ధారణ అయితే రూ.45 వేలు విలువ చేసే స్టెమి ఇంజక్షన్‌ను ఉచితంగా రోగులకు అందిస్తున్నట్లు తెలిపారు. దీని వలన చాలా మంది ప్రాణాపాయం నుంచి బయట పడుతున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్లు రేష్మా, డాక్టర్ హరికృష్ణ, శ్రీకృష్ణ, షేక్ మీర్ హుస్సేన్, ప్రియదర్శిని, రెహ్మత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి



ఇన్నర్ రింగ్‌రోడ్డు పనులపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరంలోని 48వ డివిజన్ రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మాణ పనులు తక్షణం ప్రారంభించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ ఇన్నర్ రింగ్ రోడ్, రెడ్డిపాలెం, గోరంట్ల, హిమనినగర్, సరస్వతినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను, రెడ్డిపాలెం రోడ్ నిర్మాణ పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులు ప్రారంభమైతే నగరంలో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, అందువల్ల ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. రెడ్డిపాలెం రోడ్ చాలా కీలకమని, ఈ రోడ్ నిర్మాణ పనుల జాప్యంపై ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న కొలతలతోనే రోడ్ నిర్మాణం చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్నర్‌రింగ్‌రోడ్‌లో రోడ్, డ్రెయిన్ ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. హిమని నగర్, సరస్వతి నగర్‌లలో పలు అభివృద్ధి పనులను తనిఖీ చేసి, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించని వాటికి బిల్లులు చెల్లింపులు నిలిపివేస్తామని హెచ్చరించారు. పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈ కోటేశ్వరరావు, డిఈఈ రమేష్ బాబు, ఏసీపీ మల్లిఖార్జున, ఆర్ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ ఆయుబ్‌ఖాన్, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

దేశ సేవలో విద్యార్థులు భాగస్వాములవ్వాలి



మాట్లాడుతున్న ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ చంద్రశేఖర్

గుంటూరు రూరల్: దేశ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎన్‌సీసీ గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కమాండర్ కల్నల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లకు డిఫెన్స్‌తోపాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. సామాజిక సేవలో ఎన్‌సీసీ విద్యార్థుల పాత్ర అభినందనీయమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు కొనియాడారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు వర్క్ షాప్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ముఖ్యఅతిథి కల్నల్ చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ బాల, బాలికల విభాగాల ఆఫీసర్స్ లెఫ్టినెంట్ తారాచంద్, లెఫ్టినెంట్ ఉషాక్రాంతి ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ కల్యాణ బ్రహ్మోత్సవాలు



గుండవరంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య

గుంటూరు రూరల్: నగరంలోని 48వ డివిజన్ రెడ్డిపాలెం గ్రామంలోని లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామి దేవస్థానంలో 13వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు రెండు రోజులుగా కన్నుల పండుగగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పసుపు కుంకుమార్చనలు, హోమాలను నిర్వహించారు. కుంభాభిషేకానికి గ్రామంలోని భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పొంగళ్లను అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం కల్యాణ మూర్తుల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో తీన్‌మార్ డప్పులు, సంప్రదాయ మేళాలు, బాణసంచా మిరుమిట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బుధవారం ఆలయంలో సామూహికంగా పలువురు దంపతుల చేతుల మీదుగా అమ్మవారి కల్యాణం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాద వితరణ, మహాన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చేబ్రోలు: గుండవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం శాంతి కల్యాణోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వాముల కల్యాణంను వైభవంగా నిర్వహించారు. అమ్మ,స్వామివార్లు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వేలాదిమంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్నా వెంకటేశ్వర్లు



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు తదితరులు

చేబ్రోలు: రైతులు అధికారుల సూచనలు పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్నా వెంకటేశ్వర్లు చెప్పారు. చేబ్రోలు మండలం పాతరెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, డీఆర్‌సీ డీడీఏ సుజాత పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో కంది, మొక్కజొన్న, మినుము పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. డీఏవో నున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్క భూ యజమాని రైతు విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ)ను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. డీఆర్‌సీ డీడీఏ ఐ.సుజాత మాట్లాడుతూ మట్టి నమూనాల ప్రాముఖ్యం గురించి, పచ్చిరొట్ట ఎరువుల వలన కలిగే ప్రయోజనాలను, మినుము, కంది, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలలో సస్య రక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి బి.శ్రీనివాస నాయక్, ఏఈఓ బి.మణికంఠ పాల్గొన్నారు.

పురుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కాకుమాను: రబీ సీజన్‌లో శనగ సాగు చేస్తున్న రైతులు పంటపై కాయ తొలుచు, కుంకుమ తెగులు ఆశించకుండా తగిన చర్యలు చేపట్టాలని ఏఓ సుధారాణి చెప్పారు. పెదనందిపాడు మండలంలోని పరిటాలవారిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ సుధారాణి మాట్లాడుతూ శనగ పంటలో సస్య రక్షణ చర్యలు వివరించారు. కాకుమాను మండలంలోని కాకుమాను, కొండపాటూరు గ్రామాల్లోనూ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ కె.కిరణ్మయి రైతులకు సూచనలు చేశారు.

నందూరు పెదపాలెంలో పొలం పిలుస్తోంది

పొన్నూరు: నందూరు, పెదపాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారులు మినుము, పెసర, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఏఓ డేగల వెంకట్రామయ్య రైతులకు పలు సూచనలు చేశారు.

'నీరు'గారిన నిర్వహణ

- రక్షిత మంచినీటి పథకాల శుభ్రతెక్కడ!
- పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు
- నెలల తరబడి క్లీనింగ్ చేసిన దాఖలాలు లేవు



ప్రత్తిపాడు రక్షిత మంచినీటి ట్యాంకు



నడింపాలెం పంచాయతీలో కనిపించని ట్యాంక్ క్లీనింగ్ తేదీలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు. ఇది నియోజకవర్గ కేంద్రం. మేజర్ గ్రామ పంచాయతీ కూడా. పది వేల కుటుంబాలు ఉన్న ఈ పంచాయతీలో శుద్ధ జలం ఊసే లేదు. రా వాటర్ సరఫరా చేస్తూ అధికారులు ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు. శుద్ధ జలం సంగతి అటుంచితే కనీసం రక్షిత మంచి నీటి ట్యాంక్‌లను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేసిన నీటిని అందిస్తున్న దాఖలాలు కూడా కనిపించడం లేదు. ఇది ఈ ఒక్క పంచాయతీలోని పరిస్థితే కాదు. నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామ పంచాయతీల్లో ఇదే దుస్థితి. ఉంది. గ్రామ పంచాయతీల్లో తాగునీటి ట్యాంకుల శుభ్రతను అధికారులు గాలికి వదిలేశారు. దీంతో కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ శాఖల మధ్య సమన్వయం లోపించడంతో ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతోంది. ప్రత్తిపాడు మండలంలో రెండు మేజర్, పద్నాలుగు మైనర్ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల్లో ఈఓఆర్డీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో ప్రతి 15 రోజులకోసారి నీటి ట్యాంకులను శుభ్రం చేసి, శుభ్రం చేసిన తేదీని, తిరిగి మరలా ఎప్పుడు శుభ్రం చేస్తారో అన్న తేదీని ఆయా ట్యాంకుల వద్ద ఉన్న నోటీసు బోర్డుల్లో తెలియజేయాల్సి ఉంది. అయితే నీటి ట్యాంకుల వద్ద ఈ నోటీసు బోర్డులే కనిపించడం లేదు. కొన్ని చోట్ల నోటీసు బోర్డులు ఉన్నా. ఆయా తేదీలను నమోదు చేసిన దాఖలాలు లేవు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ గాలికి..

ట్యాంకులను శుభ్రం చేసి, నీటిని క్లోరినేషన్ చేసి కుళాయిలకు సరఫరా చేయాల్సి ఉంది. క్షేత్ర స్థాయిలో ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవట్లేదు. ముళ్లచెట్లు ఏపుగా పెరిగిపోవడం వల్ల కొన్ని నీటి ట్యాంకుల పరిసరాల్లోకి కూడా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. నీటి ట్యాంకుల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోవడం వల్ల అక్కడక్కడా నీటి సరఫరా పైపులు లీకై నీరు కలుషితమవుతోందనే విమర్శలూ లేకపోలేదు. గ్రామాల్లో మైక్రో వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేయడంతో ఇసుక వాటర్ ఫిల్టర్లను మూలన పడేశారు. అనేక పంచాయతీల్లో వీటి వాడకాన్ని విస్మరించారు.

విజ్ఞాన్ వర్సిటీ అవగాహన ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో వర్సిటీ చైర్మన్ లావు రత్తయ్య తదితరులు

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ–బెంగళూరులోని ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా బెంగళూరులోని ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ సుమతి సహగల్‌తో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ష్నైడర్ ఎలక్ట్రిక్ కంపెనీతో దేశంలోని మొత్తం అకడమిక్ ఇనిస్టిట్యూట్‌లలో 'గ్రీన్ యోధ' మీద అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న తొలి యూనివర్సిటీ తమదేనన్నారు. ఈ అవగాహన ఒప్పందం వలన ష్నైడర్ ఎలక్ట్రిక్, విజ్ఞాన్ యూనివర్సిటీలు సంయుక్తంగా కలిసి 2030 నాటికి 2005 ప్రామాణిక స్థాయి కంటే 33–35 శాతం ఉద్గారాలను తగ్గించేలా లక్ష్యాలను నియమించుకున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు – ప్లేస్‌మెంట్ అవకాశాలు లభిస్తాయన్నారు. ష్నైడర్ ఎలక్ట్రిక్‌లో విద్యార్థులకు ఆన్–జాబ్ ట్రైనింగ్ ద్వారా ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుందని వెల్లడించారు. విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు తగ్గట్టు స్పెషలైజ్డ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించనున్నట్టు వివరించారు. సస్టైనబుల్ ఎనర్జీ, ఆటోమేషన్, ఐఓటీ – పవర్ మేనేజ్మెంట్ వంటి టెక్నాలజీలపై నిపుణులచే శిక్షణ అందిస్తామన్నారు. పరిశ్రమ–అకడమియా కలిసికట్టుగా రీసెర్చ్ ప్రాజెక్టులు చేపట్టే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు స్టార్టప్–ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటులో సహాయపడే అవకాశం ఉందని వెల్లడించారు. అధ్యాపకులకు పరిశ్రమకు సంబంధించిన ట్రెండ్స్–టెక్నాలజీపై శిక్షణ అందించనున్నట్టు వివరించారు. న్యూఢిల్లీలోని ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ సుమతి సహగల్ మాట్లాడుతూ అధ్యాపకులను, విద్యార్థులను టెక్నాలజీ వైపు ప్రోత్సహించడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో న్యూఢిల్లీలోని ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్లు పవన్ అన్నవరం, చైతన్య వీఏ న్ఎస్, జనరల్ మేనేజర్ రమేష్ ధావల, డెప్యూటీ జనరల్ మేనేజర్ జి.కరుణ, మేనేజర్ ఎం.మనీందర్, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెదకాకాని : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పలు పథకాల కోసం రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి పేర్కొన్నారు. గుర్తింపు కార్డు వల్ల రైతులకు పీఎం కిసాన్ పథకం, బ్యాంకు రుణాలు, పెట్టుబడి, వ్యవసాయ పరికరాలపై రాయితీలు వంటి వివిధ రకాల సబ్సిడీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తాయన్నారు. రైతులు ఆధార్ కార్డు, మొబైల్, పట్టాదారు పాసు పుస్తకం తీసుకెళ్లి రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ విధానం ద్వారా ప్రతి రైతుకూ ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తామన్నారు. సోమవారం నుంచి అన్ని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్లో రైతు వివరాల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఏఓ తెలిపారు. భూమి కలిగిన రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



పొన్నూరు: మాచవరం ప్రధాన రహదారి వెంబడి అధ్వానంగా ఉన్న చెత్త నిల్వలను తొలగించి, బ్లీచింగ్ చల్లించి సమస్యను పరిష్కరించారు. రూ.లక్షల వ్యయం.. నెరవేరని లక్ష్యం శీర్షికన సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి మండల పరిషత్ అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయాన్నే ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు గ్రామాన్ని సందర్శించి చెత్త నిల్వలను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావుకు మెమో జారీ చేసినట్టు ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు వివరణ ఇచ్చారు.

ఇంట్లో చోరీ



గుంటూరు రూరల్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటితాళాలు పగలగొట్టి ఇంటిలోకి చొరబడి బీరువాను పగలగొట్టి నగలు, నగదు చోరీ చేసిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. సీఐ వంశీధర్ కథనం ప్రకారం నల్లపాడు గ్రామానికి చెందిన వై.బాలకృష్ణ తన కుమారుడికి ఆరోగ్యం బాగాలేక శనివారం ఇంటికి తాళాలు వేసి భార్య, కుమారుడితో కలిసి విజయవాడ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. అనంతరం సోమవారం అర్ధరాత్రి సమయంలో ఇంటికి వచ్చి చూడగా ఇంటితాళాలు పగలగొట్టి, బీరువాను పగలగొట్టి ఉండటంతో పోలీసులను ఆశ్రయించారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీం ఘటన స్థలికి చేరుకుని ఆధారాలను సేకరించింది. ఘటనలో రూ.30 వేల నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.